
# మంచికి పోతే..!

పాలంకి సత్య





"అబ్బాయ్, ఊరు పొమ్మంటోంది. కాడు రమ్మంటోంది'' అంది కామేశ్వరమ్మ.

''ఇప్పుడలాంటి మాటలెందుకమ్మా'' అన్నాడు నారాయణరావు.

'నేనన్నదాంట్లో తప్పేముంది? నాకా ఎనభై ఏళ్ళు నిండాయి. బతికినన్నాళ్ళు బతికాను. పోయేలోగా ఓసారి వెంకన్న దర్శనం చేసుకోవాలని వుంది.''

''అలాగే. దానికేం భాగ్యం. ~~ఈ~~ శనాదివారాలు నాకు శలవులొస్తున్నాయి. అందరం కలిసి వెడదాం''.

* * *

తల్లికిచ్చిన మాట ప్రకారమే తిరుపతికి రానూపోనూ టిక్కెట్లు కుటుంబం మొత్తానికి కొన్నాడు నారాయణరావు.

ప్రయాణం రోజు వచ్చింది. నారాయణరావు కుటుంబమంతా రైలెక్కి కూచున్నారు.

టిక్కెట్టు ఎగ్జామినర్ వచ్చాడు. టిక్కెట్టు చూశాడు. కామేశ్వరమ్మకి సీనియర్ సిటిజన్ కన్సెషన్ టిక్కెట్టు వుంది. అరవై అయిదేళ్ళు పైబడ్డ వాళ్ళకి ప్రభుత్వం టిక్కెట్టు ఛార్జీలో రాయితీ కల్పించింది. ఆ కారణంగా కామేశ్వరమ్మ టిక్కెట్టు మిగతా టిక్కెట్లకన్నా తక్కువ ధరకే వచ్చింది.

''మీలో ఎనభై ఏళ్ళు ఎవరికి?''

మనుషుల్ని చూడగానే ఎనభై ఏళ్ళు ఎవరికో తెలియదా? ఏమిటీ చచ్చు



ప్రశ్న అనుకుని నారాయణరావు "మా అమ్మగారికి ఎనభై ఏళ్ళు. అదిగో కిటికీ పక్క సీట్లో కూచున్నావిడే మా అమ్మ" అన్నాడు.

"ఆవిడ ఏజ్ సర్టిఫికెట్ చూపించండి"

నారాయణరావు ఖంగు తిన్నాడు.

"టిక్కెట్టు కొన్నప్పుడు ఏజ్ సర్టిఫికెట్ అడగలేదండీ"

"టిక్కెట్టు కొన్నప్పుడు అడగనంత మాత్రాన రైలెక్కెయ్యడమేనా? సీనియర్ సిటిజన్స్ అందరూ ఏజ్ సర్టిఫికెట్ కూడా పట్టుకునే రైలెక్కాలి. మీరు చదువుకున్నవారిలా కన్పిస్తున్నారు. రూల్స్ పాటించకపోతే ఎలా?"

"మా అమ్మగారిని చూడండి. ఆవిడ ఎనభై ఏళ్ళ దానిలా కన్పిస్తోందా. ఇంకా అరవై అయిదు నిండనిదానిలా కనిపిస్తుందా?"

"కన్పించడానికేముంది? మన సినిమాలు చూడండి. పాతికేళ్ళ కుర్రాడు అరవై ఏళ్ళ వృద్ధుడిలా మేకప్ వేసుకోవడం లేదా? మా డ్యూటీ టిక్కెట్టు పరిశీలించడమే కానీ మనిషిని చూసి వయస్సు అంచనా వెయ్యడం కాదు".

రైల్వే కంపార్ట్‌మెంట్‌లోని మిగిలిన జనమంతా సినిమా చూసినట్లు చూస్తున్నారు. ఒక్కరు కూడా నారాయణరావు వైపు మాట్లాడలేదు.

"ఏం చెయ్యమంటారు నన్ను. టిక్కెట్టు చూసే దాకా నాకు మా అమ్మకు కన్సెషన్ ఇస్తారనే తెలియదు."

"మీకు రెండే మార్గాలు. రైలు దిగిపోండి లేదా ఎక్సెస్ ఛార్జీ, ఫైనూ కట్టండి".

"నేనే తప్పుచేశానని ఫైను కట్టాలి?"

"ఎనభై ఏళ్ళు అని సర్టిఫికెట్ లేకుండా ప్రయాణం చేస్తున్నారు. సరైన టిక్కెట్టు లేకుండా ప్రయాణం చెయ్యడం నేరం. మీరు ఫైను కట్టాల్సిందే".

నారాయణరావు కోపంతో కుతకుతా ఉడికిపోయాడు. చెయ్యగలిగేదేముంది? టిక్కెట్టు ఎగ్జామినర్ అడిగినంత డబ్బూ తీసి ఇచ్చాడు. టిక్కెట్టు కలెక్టర్ రసీదు రాసి ఇచ్చి "రసీదు జాగ్రత్తగా వుంచుకోండి. ఇంక మిమ్మల్ని ఎవరూ ఏమీ అడగరు" అన్నాడు. టిక్కెట్టు ఎగ్జామినర్ పేరుని మనస్సులో జాగ్రత్తగా వుంచుకున్నాడు నారాయణరావు.

* * *

తిరుపతిలో దర్శనం చేసుకుని కుటుంబంతో సహా రైలెక్కాడు నారాయణరావు. టిక్కెట్టు ఎగ్జామినర్ రాగానే టిక్కెట్టు ఇచ్చి "అయ్యా మా అమ్మగారి ఏజ్ సర్టిఫికెట్ నా దగ్గర లేదు. ఎంత ఎక్కువ డబ్బు కట్టాలో చెప్తే కట్టేస్తాను" అన్నాడు.

మనమే ముందు చెప్పేస్తే ఫైను కట్టక్కరలేదన్నది నారాయణరావు ఆశ.

"ఎందుకు సార్ ఎక్సెస్ కట్టడం? ఆవిడను చూస్తే చాలా పెద్దావిడ అని తెలుస్తోంది కదా. మీరు హాయిగా వుండండి. ఏ సమస్యా రాదు".

టిక్కెట్టు ఎగ్జామినర్ పేరు గుర్తుంచుకున్నాడు నారాయణరావు.

* * *

ఇంటికి రాగానే రైల్వే జనరల్ మేనేజరు గారికి లెటర్ రాశాడు. తను ప్రయాణించిన రైళ్ళ నంబర్లూ, తను ప్రయాణం చేసిన తేదీలు సరిగ్గా వేశాడు. తన తల్లి వయస్సు సర్టిఫికెట్ లేదన్న కారణంగా ఫైను కట్టమనడం అన్యాయమని రాశాడు. తిరుపతికి వెళ్ళే రైల్లో టిక్కెట్టు ఎగ్జామినర్ వ్యవహరించిన తీరు బాగులేదన్నాడు. ప్రయాణీకులతో మర్యాదగా ప్రవర్తించాల్సిన అవసరం రైల్వే ఉద్యోగులకి ఉందన్నాడు. తన దగ్గర అన్యాయంగా వసూలు చేసిన మొత్తం తిరిగి తనకు చెల్లించమని రాశాడు. తిరుపతి నుంచి తిరుగు ప్రయాణంలో టిక్కెట్టు ఎగ్జామినర్ ఎంత బాగా ప్రవర్తించాడో వివరంగా రాశాడు. ఉత్తరం పోస్టు చేశాక నారాయణరావుకి ఎంతో తృప్తి కలిగింది. మంచికి బహుమతీ, చెడుకు శిక్షా తప్పవనుకున్నాడు.

* * *

కంప్లైంటు రాసిన మూడు నెలలకి నారాయణరావుకి రైల్వే యాజమాన్యం నుంచి రిప్లై వచ్చింది. నారాయణరావు రాసిన కంప్లైంటు పరిశీలించామనీ, టిక్కెట్టు ఎగ్జామినర్ సరిగ్గానే వ్యవహరించాడనీ, వయస్సు రుజువు చెయ్యాల్సిన బాధ్యత ప్రయాణీకులపైనే వుందనీ, పైకం తిరిగి ఇవ్వాల్సిన అవసరం రైల్వే యాజమాన్యానికి లేదనీ ఉత్తరంలో వుంది.

నారాయణరావు కోపంతో కుతకుతలాడిపోయాడు.

* * *

నారాయణరావుకి ఉత్తరం అందిన రోజునే తిరుపతి నుంచి వచ్చిన రైల్లోని టిక్కెట్టు ఎగ్జామినర్‌కి మెమో వెళ్ళింది. టిక్కెట్టు ఎగ్జామినర్ యొక్క డ్యూటీలలో టిక్కెట్లని తనిఖీ చెయ్యడం అతి ముఖ్యమైనదనీ, కన్సెషన్ టికెట్లని క్షుణ్ణంగా పరిశీలించాలనీ, అవసరమైన సర్టిఫికెట్లు వున్నాయా లేదా అన్నది నిర్ధారించుకోవాలని వుంది. సరిగ్గా పరిశీలించకపోవడం వల్ల రైల్వేల ఆదాయానికి గండి పడిందనీ, ఆ కారణంగా సదరు టిక్కెట్టు ఎగ్జామినర్‌పై చర్య ఎందుకు తీసుకోకూడదో వారం రోజుల్లో తెలియచెయ్యాలని మెమోలో వుంది.

ఈ మెమో సంగతి నారాయణరావుకి తెలిస్తే...

★

## మెన్సెస్.... మృత్యువు

బహిష్టు ముందు రోజుల్లో స్త్రీలు బాగా డిప్రెషన్‌కి లోనవుతారు. ఆ డిప్రెషన్‌లో వాళ్లు ఆత్మహత్యలు చేసుకునే అవకాశం, యాక్సిడెంట్లలో చనిపోయే అవకాశమూ ఉంది. రుతుచక్రపు సగభాగపు రోజుల్లో వీరు జబ్బు పడటానికే ఎక్కువ అవకాశాలుంటాయి. ముఖ్యంగా గుండె జబ్బులున్నవాళ్లు. ఈ విషయంపై లండన్ మెడికల్ ఇన్‌స్టిట్యూట్ వాళ్లు జరిపిన రిసెర్చిలో 18 నుండి 46 ఏళ్లలోపు చనిపోయిన 102 మంది స్త్రీలలో 13 మంది రుతుచక్రపు ప్రథమార్థపు రోజుల్లో చనిపోతే, 89 మంది ద్వితీయార్థపు రోజులలో చనిపోయినట్లు వెల్లడైంది. ఈ 89 మంది స్త్రీలలోనూ అరవై మంది తమ రుతు చక్రకాలంలో 17 నుంచి 23 రోజుల మధ్య మాత్రమే చనిపోవటం విశేషం. పైన చెప్పిన పరిశీలనలోనే యాక్సిడెంట్లు, ఆత్మహత్యల మూలంగా చనిపోయిన స్త్రీలలో యాభైశాతం మంది మెన్సెస్ ముందు రోజుల్లో చనిపోయినట్లు స్పష్టమైంది. స్త్రీల తాలూకు మొత్తం మరణాలతో పోల్చి చూసినప్పుడు మెన్సెస్ ముందురోజుల్లో చనిపోయిన వాళ్లు ఐదు శాతానికి దగ్గరగా ఉన్నట్లు తెలిసింది.